సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



రూ.లక్ష విరాళం


ఆలమూరు: గుమ్మిలేరు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీమురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు (ఆలమూరు) శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు.



రూ.10.41 లక్షల ఆదాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి ఏప్రిల్ 25 నుంచి 99 రోజులకు హుండీల ద్వారా రూ.10,41,810 ఆదాయం వచ్చింది.

సముద్రంలోకి 5.66 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం రాత్రి 5,66,157 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, సెంట్రల్ 1,000, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. రాత్రి 8 గంటలకు బ్యారేజీ వద్ద 8.40 అడుగులకు, భద్రాచలం లో 34.10 అడుగులకు నీటిమట్టాలు తగ్గాయి.

న్యూస్‌రీల్

8 వేల టన్నుల కొబ్బరి కొనుగోలు లక్ష్యం

ఏపీ ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్



కొత్తపేట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 8 వేల టన్నుల కొబ్బరి కొనుగోలు లక్ష్యంగా నాఫెడ్ – ఆయిల్‌ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఏపీ ఆయిల్‌ఫెడ్ మేనేజర్ ఉప్పాడ సుధాకర్ తెలిపారు. కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కార్యాలయం, మార్కెట్ యార్డు వద్ద నాఫెడ్- ఆయిల్‌ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొబ్బరి అత్యధిక దిగుబడి ఉన్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోనసీమ జిల్లాలో అంబాజీపేట, కొత్తపేటతో పాటు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ప్రారంభించామన్నారు. ఇంకా ముమ్మిడివరం, నగరం, తాటిపాక ప్రాంతాల్లోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యమైన మిల్లింగ్ కొబ్బరి క్వింటాలు రూ.11,160, బాల్ కొబ్బరి క్వింటాలు రూ.12 వేలకు కొనుగోలు చేస్తామన్నారు. ఇందులో రద్దు, ధూళి, పెంకు 1 శాతం, ముడతలు ఏర్పడిన కొబ్బరి చిప్పలు 10 శాతం, పగిలిన చిప్పలు 10 శాతం, తేమ 6 శాతం, నలుపు, బూజు కొబ్బరి చిప్పలు 10 శాతం మించి ఉండకూడదన్నారు. కొబ్బరి ఎగుమతి, దిగుమతులకు అనువైన మార్కెట్ యార్డుల్లో నాఫెడ్- ఆయిల్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి కొనుగోలు చేస్తున్నామన్నారు. వీటిని రైతులు ఉపయోగించుకుని మద్దతు ధర పొందాలని కోరారు.

గిరిజన యువతకు ప్రత్యేక శిక్షణ

అమలాపురం రూరల్: జిల్లాలో డిగ్రీ, బీఈడీ, డీఈడీ, టెట్ పాసైన గిరిజన (ఎస్టీ) యువతీ, యువకులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.నాగశిరీష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ అభ్యర్థులకు రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద శిక్షణ ఉంటుందన్నారు. ఏదైనా స్క్రీనింగ్ టెస్ట్ పాసైన అభ్యర్థులు డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ సదుపాయం ఉందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల ఎనిమిదో తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇందులో ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను 14న ఐటీడీఏ కార్యాలయం నోటీస్ బోర్డ్‌లో పెడతారన్నారు. అర్హులకు ఈ నెల మూడో వారం నుంచి సుమారు 90 రోజులపాటు భోజనం వసతితో ఉచిత శిక్షణను ఇస్తారన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేక రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ 75690 98197 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు ఆదేశాలు

రాయవరం: పాఠశాల సముదాయ సమావేశాలు 2024–25 నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. నెలవారీ సమావేశాల తేదీలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు ప్రకటించారు. ఈ నెల 17, 18 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనుండగా, సెప్టెంబర్‌లో 17, 18, అక్టోబర్‌లో 16, 17, నవంబర్‌లో 18, 19, డిసెంబర్‌లో 16, 17 తేదీల్లో చేపడతారు. 2025 జనవరిలో 22, 23, ఫిబ్రవరిలో 21, 22, మార్చిలో 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు. జిల్లాలో 122 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో జరుగుతాయి.

7 నుంచి భీమేశ్వరుని మూలవిరాట్ దర్శనాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి మూలవిరాట్ దర్శనాలకు ఈ నెల 7 నుంచి భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శనివారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యాన మూలవిరాట్ జీర్ణోద్ధరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. వీటిని పూర్తి చేసిన అనంతరం ఈ నెల 5 నుంచి 7 వరకూ సంప్రోక్షణ, విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఈఓ తెలిపారు. 5న కళావాహన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పరిషత్, కుచ్ఛత్రయం, మండపారాధన, రుత్విక్ వరుణలు, దీక్షధారణ, కృష్ణ యజుర్వేద పారాయణ, గణపతి హోమం, వాస్తు హోమం, చతుర్వేద స్వస్తి నిర్వహిస్తామని వివరించారు. 6న గణపతి పూజ, పుణ్యాహవాచనం, కుచ్ఛత్రయం, పునఃపూజలు, ఉదయ శాంతి, శతరుద్ర, శ్రీసూక్త, దుర్గా సూక్త, శుక్ల యజుర్వేద పారాయణలు, రుద్ర, చండీ హోమాలు, చతుర్వేద స్వస్తి జరుగుతాయన్నారు. ఏడో తేదీన గణపతి పూజ, పుణ్యాహవాచనం, పునఃపూజలు, రుగ్వేద పారాయణ, గర్భాలయ పూజలు, పరివార దేవతార్చనలు, కుంభాలు, గోదర్శనం, శాంతి హోమం, పూర్ణాహుతి అనంతరం ఉదయం 9.34 గంటలకు కళావాహన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం ఉదయం 11.05 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఈఓ తెలిపారు.

ఆకూలి కేకలు!

- మూడు నెలలుగా ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- జిల్లా వ్యాప్తంగా రూ.75.21 కోట్ల బకాయిలు
- వేతనాల కోసం 5.11 లక్షల మంది ఎదురుచూపులు



ఆలమూరులో చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఆలమూరు: ఎండైనా, వానైనా కష్టించి పనిచేసి ఏ రోజుకారోజు కడుపు నింపుకొంటున్న కూలీలెందరో.. ఆ రెక్కల కష్టానికి తగిన వేతనాలు అందక బతుకులు 'కూలి'పోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిర్లక్ష్యపు చెరలో చిక్కుకుంది. చేసిన పనులకు మూడు నెలల నుంచి వేతనాలు అందక ఉపాధి కూలీలు ఆకలి కేకలు పెడుతున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల వరకూ సక్రమంగా అందిన ఉపాధి కూలీల వేతనాలు తదనంతరం నిలిచిపోవడంపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉపాధి వేతన బకాయిల కోసం నిత్యం అధికారుల వద్ద గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారంటూ మనోవేదన చెందుతున్నారు. 2019–24 మధ్య కాలంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును ప్రస్తుత ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకుని అంతలోనే ఎంత తేడా అంటూ నిట్టూర్పు వదులుతున్నారు. ఉపాధి కూలీల ఆకలి కేకలను పాలకులు పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లోని 385 గ్రామాల్లో ఉపాధి పథకానికి సంబంధించి 2,23,738 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిని 1.51 లక్షల కుటుంబాలు మాత్రమే వినియోగిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 5,11,494 మంది కూలీలు ప్రభుత్వం మంజూరు చేసిన 2,385 పనులకు సంబంధించి 27.78 లక్షల పనిదినాలు ఉపయోగించుకున్నారు. వీరందరికీ 2024 మే 6 నుంచి ఆగస్టు 3 వరకూ రూ.75.21 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు తీసుకు రావాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించడం ఉపాధి కూలీలకు ఇబ్బందిగా పరిణమించింది.

గతం.. ఎంతో ఘనం

గతం ఎంతో ఘనం నానుడి నిజం అవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పనులు రికార్డు స్థాయిలో జరిగేవి. అలాగే వేతనాల మంజూరులో గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుని కూలీలకు అండగా నిలిచేవారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 30 లక్షల పనిదినాలు కేటాయించగా, అంతకు మించి రికార్డు స్థాయిలో 43 లక్షల వరకూ పనిదినాలు కల్పించింది. ఇలా అప్పట్లో జిల్లాలో సుమారు రూ.185 కోట్ల వరకూ ఉపాధి పనుల కోసం వెచ్చించి అప్పటి ప్రభుత్వం సమర్థతను చాటుకుంది. అందులో కూలీల వేతనాలు రూ.112 కోట్లు కాగా, మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా రూ.65 కోట్లు, పరిపాలన పరంగా రూ.8 కోట్లను ఖర్చు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాల నిర్మాణంతో పాటు అంతర్గత రహదారులు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి గణనీయమైన రీతిలో జరిగింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉపాధి కల్పన పట్ల అనుసరిస్తున్న వైఖరితో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమేపీ తగ్గిపోతుంది.

పంచాయతీరాజ్ సంస్థల బలోపేతం ఇదేనా?

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసేందుకు ఎన్ఆర్‌జీఈఎస్ దోహదపడుతుందంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న తీరుకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకూ వేతనాల చెల్లింపులపై దృష్టి సారించకపోవడంపై ఉపాధి కూలీల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతుంది. అలాగే ఎన్ఆర్‌జీఈఎస్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు **నకాలంలో బిల్లులు రాక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండటం పరిస్థితికి అద్దం పడుతుంది.**

ఆవేదన చెందుతూ..

వరదలు, వర్షాల ప్రభావంతో వ్యవసాయ పనులు లేక విలవిలలాడుతున్న కూలీలకు ఉపాధి వేతనాలు అందకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు. ఉపాధి కూలీలకు సాంత్వన చేకూర్చాల్సిన ప్రభుత్వం నెలల తరబడి మిన్నకుంటి పోవడంపై ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో వేతనాలు అందించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ఒక్కో ఉపాధి కూలీ ఖాతాలో రూ.వేలల్లో వేతనాలు జమ కావాల్సి ఉన్నా ఇప్పటి వరకూ పైసా కూడా ప్రభుత్వం మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలో మండలాలు	జాబ్ కార్డులు	పనిదినాలు లక్షల్లో	వేతన బకాయిలు రూ.కోట్లలో
అయినవిల్లి	11,628	1.02	2.95
ఆలమూరు	8,765	1.22	3.58
అల్లవరం	9,117	1.34	2.92
అమలాపురం	11343	1.36	3.12
అంబాజీపేట	9,718	1.06	3.28
ఆత్రేయపురం	8,362	1.34	3.49
ఐ.పోలవరం	12,546	1.02	3.74
కె.గంగవరం	13,726	1.52	4.71
కపిలేశ్వరపురం	12,120	1.02	3.24
కాట్రేనికోన	11,910	1.06	3.45
కొత్తపేట	11,187	1.65	4.99
మలికిపురం	8,088	1,54	2.05
మామిడికుదురు	6,722	0.71	2.34
మండపేట	12,160	0.95	2.47
ముమ్మిడివరం	8,554	1.34	4.12
పి.గన్నవరం	10,819	1.32	3.85
రామచంద్రపురం	13,210	1.58	4.83
రావులపాలెం	9,658	1.36	2.68
రాయవరం	9,780	1.01	2.80
రాజోలు	7,266	1.34	2.34
సఖినేటిపల్లి	5,778	1.42	3.12
ఉప్పలగుప్తం	11,281	1.62	5.14

తక్షణం మంజూరు చేయాలి



ఎన్ఆర్‌జీఈ ఎస్ పథకంలో చేపట్టిన పనులకు సత్వరమే వేతనాలు మంజూరు చేసి తమ బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. గతంలో ఈ విధంగా చెల్లింపుల్లో జాప్యం జరగలేదు. నెలల తరబడి ఉపాధి వేతనం అందకపోతే మేము ఎలా జీవించాలో అధికారులు అర్థం చేసుకోవాలి.

– **పితాని వెంకట్రావు**, ఉపాధి కూలీ, పెదపళ్ల, ఆలమూరు మండలం

జీవనోపాధిపై తీవ్ర ప్రభావం



ఉపాధి పనులకు సంబంధించి నెలల తరబడి వేతనాల చెల్లింపులు జరగకపోవడంతో జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడింది. అసలే వర్షాకాలం కావడంతో వ్యవసాయ పనులు అంతగా ఉండటం లేదు. దీనివల్ల ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సత్వరమే ఆదుకోవాలి.

– **ఎస్.దుర్గయ్య**, ఉపాధి కూలీ, పెనికేరు, ఆలమూరు మండలం

వారం రోజుల్లో వేతనాలు ఇస్తాం



ఎన్ఆర్‌జీఈఎస్ పథకం కింద ఉపాధి పనులు చేసిన కూలీలు ఆందోళన చెందవద్దు. రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల వ్యవధిలో వేతనాలు చెల్లించనుంది. ఉపాధి కూలీలందరికీ చేసిన పనికి సంబంధించి పూర్తిస్థాయిలో వేతనాలను జమ చేస్తుంది. గత ఏడాది లక్ష్యానికి మించి ఉపాధి పనులు చేపట్టడం వల్ల వేతనాల చెల్లింపుల్లో జాప్యం అయినట్లు తెలుస్తోంది.

– **పి.మధుసూదన్**, జిల్లా డ్వామా పీడీ

జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



నర్శిపూడిలో పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

ఆలమూరు: జ్వరాల నియంత్రణకు జిల్లాలోని 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈనెల ఒకటిన పారిశుధ్యం–పడకేసిన వైద్యం అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జ్వరాల నియంత్రణకు పారిశుధ్య పనులు వేగవంతం చేయించాలని ఆయా పీహెచ్‌సీల అధికారులను జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశించింది. దీంతో క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్, వైద్యారోగ్య సిబ్బంది పరిసరాలను శుభ్రం చేయించి దోమలను నిర్మూలిస్తున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు, ఆలమూరు మండలం నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లో ఇప్పటికే నిర్వహించిన సర్వేలో జ్వర పీడితులు, ఇతర వ్యాధిగ్రస్తులు లేరని వైద్యాధికారులు నిర్ధారించారు.

'సూర్యఘర్'తో విద్యుత్ వినియోగదారులకు మేలు



ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, అధికారులు

అమలాపురం రూరల్: బలహీన వర్గాల గృహ విద్యుత్ వినియోగదారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ నోడల్ ఏజెన్సీగా నిర్ణయించి ప్రవేశపెట్టిన ఈ పథకం అమలుపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సౌరశక్తితో సూర్యఘర్ యూనిట్ పనిచేస్తుందని తెలిపారు. ఈ పథకంలో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. నెలవారీ విద్యుత్ బిల్లు రూ.వెయ్యి దాటిన వారికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.75 వేల వరకూ ఖర్చు అవుతుందని, ఇందులో రూ.30 వేలను ప్రభుత్వం రాయితీగా ఇస్తుందన్నారు. రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు గరిష్టంగా రూ.78 వేల వరకూ ప్రభుత్వ రాయితీ పొందే వెసులుబాటు ఉందన్నారు. ఈ పథకం అమలుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్, డీఈఈ జి.అన్నవరం, ఎ.వీరభద్రరావు, ఏఈలు నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం తీర్థ యాత్రల స్పెషల్

17న రావులపాలెం నుంచి ఆర్టీసీ సర్వీస్

కొత్తపేట: ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి రామేశ్వరం తీర్థ యాత్రల ప్రత్యేక బస్ సర్వీస్ ఈ నెల 17న బయలు దేరుతుందని ఆ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. శనివారం కొత్తపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామేశ్వరం తీర్థయాత్రల విశిష్టత, దర్శనం నిమిత్తం భక్తుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని పుష్ బ్యాక్ 2 ప్లస్ 2 సిటింగ్ గల సూపర్ లగ్జరీ బస్ ఏర్పాటు చేశామన్నారు. 17న రావులపాలెం కాంప్లెక్స్‌లో బస్సు బయలుదేరి 24న తిరిగి వస్తుందన్నారు. ఏడు రోజుల తీర్థయాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీరంగం, జంబుకేశ్వరం, పళని, కోయంబత్తూరు (ఈశా ఫౌండేషన్), మధురై, రామేశ్వరం, ధనుష్కోడి, తంజావూరు, కాంచిపురం, శ్రీకాళహస్తి, విజయవాడ దేవాలయాల దర్శనం చేయిస్తారన్నారు. టిక్కెట్ చార్జి ఒకరికి రూ.8,500 (ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి టిఫిన్‌తో సహా) ఉంటుంది. రూమ్ అద్దెలు యాత్రికులే భరించాలని తెలిపారు. యాత్రలకు వచ్చే ప్రయాణికులు అసిస్టెంట్ మేనేజర్ 73829 11871, ఆర్ఎస్ రావు 73829 12398, వీరభద్రరావు 73829 12400 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

సారె తెచ్చి.. సమర్పించి

శ్రీదేవి అమ్మవారికి పూజలు



అమలాపురంలో శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ప్రదర్శనగా ఉంచిన సారె



అమ్మవారి మెడలో వేసేందుకు తయారు చేసిన చాక్లెట్ల దండ

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం శనివారం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. తొలుత వందలాది మంది మహిళలు స్వయంగా తయారు చేసిన పలు రకాల స్వీట్లు స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో ప్రదర్శించారు. అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా సారెను తీసుకు వచ్చి అమ్మ సన్నిధిలో ఉంచి మొక్కలు తీర్చుకున్నారు. మంగళ వాయిద్యాల నడుమ రమణీయంగా ఈ కార్యక్రమం జరిగింది. దాదాపు వంద రకాల స్వీట్లు, పన్నెండు రకాల పండ్లు అమ్మవారికి సారెగా సమర్పించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సారె సమర్పణ, ప్రదర్శన, ఊరేగింపు కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆశెట్టి ఆదిబాబు, గంగాబత్తుల చిన్నా, రవణం నరసింహారావు, జీవి తదితరులు భక్తులకు సేవలు అందించారు. శ్రీదేవి అమ్మవారికి పట్టణానికి చెందిన పూల వ్యాపారి కసిరెడ్డి రాజు చాక్లెట్లతో దండ వేశారు. దీనిని 300 చాక్లెట్లతో రూపొందించారు.

అన్నింటా తోడూ నీడై..

- వీడదీయరానిది స్నేహబంధం
- అక్షరాలకు అతీతమైన పుస్తకమది
- నేడు ఫ్రెండ్‌షిప్ డే



అమ్మకానికి సిద్ధమైన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు

రాయవరం: స్నేహం అవధులు లేనిది.. అంతస్తులు చూడనిది.. వయసు లెక్కచేయనిది.. ఇష్టాలను పంచుకునేది.. కష్టాల్లో తోడుగా నిలిచేది.. ఇలా ఒకటీ మిటీ.. ఆ బంధాన్ని తెలిపేందుకు భావాలు ఎన్నో. దాని విలువను వివరించడానికి అక్షరాలు కూడా చాలవు.. ఆ అనుబంధాన్ని అక్షరీకరించడానికి భాషలూ సరితూగవు. స్నేహమంటే నవమాసాలు మోయని తల్లి.. రక్తం పంచని తండ్రి.. వాటా అడగని తోబుట్టువు.. చుట్టరికం లేని బంధువు. ఏ నిర్ణయం తీసుకోవాలో తెలియని సమయంలో దిశా నిర్దేశం చేసే మార్గదర్శి స్నేహితుడు. భారమైన హృదయానికి ఓదార్పు.. అశాంతి నిండిన మనసుకు ఆదరింపు.. అలసిన కన్నులలో కమ్మని కల.. ఇలా స్నేహం గురించి ఎన్ని ఉపమానాలు చెప్పినా తక్కువే. అందుకే అంటారు స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమని. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల కారణంగా ఎప్పుడో చిన్ననాటి స్నేహితులు కూడా దగ్గరవుతున్నారు. ఆదివారం ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ ఓ సినీ గేయ రచయిత స్నేహానికి ఉన్న అర్థాన్ని పాట రూపంలో తెలిపాడు. ఇదొక్కటే కాదు స్నేహం విలువను తెలియజేస్తూ మరెన్నో పాటలు వచ్చాయి. అవన్నీ మరుపురాని గేయాలుగా మిగిలిపోయాయి. స్నేహం జీవితాంతం నిలిచి ఉంటుంది. ధనం ఒకరోజు వస్తుంది. రేపు పోతుంది. కష్టసుఖాల్లో పాలు పంచుకునే వాడే నిజమైన స్నేహితుడు. అలాంటి స్నేహితుడు ఒక్కడుంటే చాలు. వారి జీవితం ధన్యమే అవుతుంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఫ్యాన్సీ షాపుల వద్ద వివిధ రకాల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వివిధ రకాల డిజైన్లలో ఇవి ఆకట్టుకుంటున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు యువతీ యువకులు ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు యువత ప్రత్యేక ఏర్పాట్లలో నిమగ్నమైంది.

కష్టసుఖాలు పంచుకునేందుకు..



ఆన్‌లైన్‌లో స్నేహమంటే నష్టాన్ని కొనితెచ్చుకోవడమే. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు తప్పుడు డీపీలు, ఐడీల పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. సెల్‌ఫోన్ లేని రోజుల్లో ఫ్రెండ్‌షిప్‌ను ఉత్తరాల ద్వారా కష్టసుఖాలు పంచుకునే వాళ్లం. దీనిద్వారా బంధం ఎంతో బలపడేది. ఆఫ్‌లైన్‌లో మనకు తెలిసిన వారితో స్నేహం ఎంతో ఉత్తమం.

– **డి.సూర్యప్రకాష్**, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రామచంద్రపురం


ఆన్‌లైన్ స్నేహాలపై అప్రమత్తం



సోషల్ మీడియా ప్రభావం సమాజంలో ఎక్కువగా ఉంది. సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహం చేసే సందర్భంలో జాగ్రత్తగా ఉండాలి. గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేసేటప్పుడు మరింత అప్రమత్తత అవసరం. నమ్మకం కుదిరే వరకూ వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను పంచుకోరాదు.

– **బి.కృష్ణారావు**, జిల్లా ఎస్పీ, అమలాపురం

నమ్మకం.. నిజాయితీ ఉండాలి



నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహమే కలకాలం ఉంటుంది. అవసరాలకు వాడుకునే స్నేహం సరి కాదు. బంధువులకు కూడా చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతోనే పంచుకోగలం. అనుకోకుండా పరిచయమై జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే.

– **కొండపల్లి లలిత**, ప్రభుత్వ ఉద్యోగిని, వేగాయమ్మపేట, రామచంద్రపురం మండలం

అక్విడెక్టుపై నుంచి దూకి వ్యక్తి గల్లంతు


పి.గన్నవరంలో నదిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న బృందాలు

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుపై నుంచి శనివారం ఉదయం దూకిన ఓ గుర్తు తెలియని వ్యక్తి గల్లంతయ్యాడు. దీనిని గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఇన్‌చార్జి ఎస్సై చిరంజీవిలు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. సుమారు 42 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి కొత్త అక్విడెక్టుపై చెప్పులు వదిలి నదిలోకి దూకినట్లు అధికారులకు స్థానికులు తెలిపారు. దీంతో బూరుగులంక రేవులో ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి వైనతేయ నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకూ గాలించినా ఆ వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి


సత్యవతి (ఫైల్)

రాజోలు: ఓ గుర్తు తెలియని మోటార్ సైకిల్ వేగంగా ఢీకొనడంతో సోంపల్లికి చెందిన కామాడి సత్యవతి (70) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. సోంపల్లి ఆంజనేయస్వామి గుడి వద్ద ఈ నెల 2వ తేదీ రాత్రి సత్యవతి రోడ్డు దాటుతుండగా రాజోలు నుంచి తాటిపాక వైపు వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆమెను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు కామాడి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయోగాల్లో పవర్‌ఫుల్

- అటల్ మారథాన్‌లో ప్రాజెక్టుల ఎంపిక
- విద్యార్థుల ప్రతిభకు తగిన ఫలితం
- గత ప్రభుత్వ ప్రోత్సాహంతో గుర్తింపు

మధురపూడి/ కంబాలచెరువు(రాజమహేంద్రవరం)/ ఉప్పలగుప్తం: సాంకేతికతకు పట్టం ఇది.. నిరంతర శ్రమకు దక్కిన ఫలమిది.. కార్యసాధనకు ఉన్నత ఆలోచన తోడైతే, సహకారమూ అందివస్తే వచ్చిన విజయమిది. జాతీయ స్థాయి అటల్ మారథాన్ 2023-24 పోటీల్లో తూర్పుగోదావరి జిల్లాలో 3, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఒక ప్రాజెక్టు ఎంపికైంది. సాంకేతిక రంగం వైపు విద్యార్థులు అడుగులు వేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2019 నుంచి కొన్ని పాఠశాలల్లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబొరేటరీలను ఎంపిక చేశాయి. ఈ ల్యాబ్‌లలో సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి కలిగిన 7, 8, 9 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసి సమాజానికి ఉపయోగపడేలా ప్రాజెక్ట్‌లను రూపొందిస్తున్నారు. ఇలా తూర్పుగోదావరి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. దేశ వ్యాప్తంగా లక్షల్లో స్కూళ్ల నుంచి వినూత్న ఆలోచనలు, ప్రోటో టైప్ వర్కింగ్ మోడల్స్‌ను ఆన్‌లైన్ ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్‌కు పంపించారు. ఇందులో బెస్ట్ 500 వినూత్న ఆలోచనలు, ప్రోటో టైప్ వర్కింగ్ మోడల్స్ ఎంపిక జాబితాలో ఉన్నాయి. ఇందులో కోరుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్మార్ట్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం, ధవళేశ్వరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తయారు చేసిన వెహికల్ యాంటీ థెఫ్ట్ ఫేస్ రికగ్నేషన్ సిస్టం, రాజమహేంద్రవరంలోని భాష్యం హైస్కూల్ బాబానగర్ శాఖ విద్యార్థులు తయారు చేసిన- బైక్ ఫాల్ రికగ్నిషన్ సిస్టంలు జాతీయ స్థాయిలో విడుదలైన అటల్ మారథాన్ టాప్ 500 లిస్టులో ఉన్నాయి. ఇది పూర్తిగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మోడల్ ఇన్‌చార్జులు, ఆ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు, హెచ్ఎంల కృషి ఫలితమేనని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అటల్ మారథాన్‌లో జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. స్మార్ట్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం పరిశోధనకు 124వ స్థానం దక్కింది. ఇక్కడి ఉపాధ్యాయుల శిక్షణ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థులు ఆరితేరారు. జాతీయ అవార్డు సాధకులైన వెంకట చరణ్, మనోహర్, లలితేంద్ర, సాయిలను రాజమహేంద్రవరంలో అధికారులు అభినందించారు.



అటల్ మారథాన్‌లో కోరుకొండ విద్యార్థుల పరిశోధనను పరిశీలిస్తున్న బృందం

గొల్లవిల్లి పాఠశాలకు 376 స్థానం

కోనసీమ జిల్లాలోని గొల్లవిల్లి జెడ్పీ హైస్కూల్‌కు జాతీయ స్థాయి అటల్ మారథాన్‌లో 376వ స్థానం దక్కింది. విద్యార్థులు నూకల రేవతి దివ్యభాను, మదిరి తనుష్ తేజ తయారు చేసిన కిట్టీ ఫ్లోర్ క్లీనర్ రిమోట్ సహాయంతో పనిచేస్తుంది. దీనిని స్మార్ట్‌ఫోన్‌కు బ్లూ టూత్ సహాయంతో పని చేయించవచ్చు. వీల్ చైర్‌కు పరిమితమైన దివ్యాంగులు, వృద్ధులు ఎవరి సహాయం లేకుండా రిమోట్ కంట్రోల్‌తో అతి సులభంగా ఫ్లోర్‌ను క్లీన్ చేసుకోవచ్చు. ఈ కిట్టీ ఫ్లోర్ క్లీనర్‌ను రూపొందించడానికి ప్రభుత్వం సమకూర్చిన వ్యయంలో కేవలం రూ.4 వేలు కేటాయించామని విద్యార్థులు వెల్లడించారు.


జాతీయ స్థాయికి ఎంపికైన కిట్టీ ఫ్లోర్ క్లీనర్

అలుపెరగని శ్రమ



ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అలుపెరగకుండా శ్రమించారు. క్రమం తప్పకుండా నిర్వహించిన శిక్షణ ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు సాధించారు. స్మార్ట్ వెహికల్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం పరిశోధనకు జాతీయ స్థాయిలో 124వ స్థానం కోరుకొండ హైస్కూల్‌కు దక్కడం ఆనందం.

–ఆనంద్, టీచర్, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వాహకుడు, కోరుకొండ

చాలా సంతోషంగా ఉంది



మేము చేసిన ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. నేను రెండేళ్లుగా మా పాఠశాల ల్యాబ్‌లో చాలా ప్రాజెక్ట్‌లను ఆసక్తిగా చేశాం. నేను నాసాలో ఉద్యోగం సంపాదించి దేశానికి సేవలందించాలనుకుంటున్నాను. నేను ఇంజినీరింగ్ చదివి నైపుణ్యం పెంచుకునే దిశగా ప్రయత్నిస్తాను.

–నూకల రేవతి దివ్యభాను, గొల్లవిల్లి జెడ్పీ హైస్కూల్

ఉపాధ్యాయుల సహకారంతో..



నేను పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో చాలా అంశాలపై శిక్షణ పొందాను. మేము చేసిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంలో మా ఉపాధ్యాయుల సహకారం ఎనలేనిది. దీనిని మరింత మెరుగుపరిచేలా ప్రయత్నిస్తాను. ఎలక్ట్రానిక్స్ రంగంలో కొత్త ప్రాజెక్ట్‌లు తయారుచేసి సమాజానికి అందించాలనేది నా ఆశయం.

–మదిరి తనుష్‌తేజ, గొల్లవిల్లి జెడ్పీ హైస్కూల్

అనాథ రక్షకా.. అఖిలాండ నాయకా


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి


భక్తులతో పోటెత్తిన ఆలయం

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి
- ఒకరోజే రూ.36.89 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవింద నామస్మరణ వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది. అశేష భక్తజనం నడుమ ఆలయం శోభాయమానంగా వెలుగొందింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామివారిని పండ్లు, ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.36,89,188 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటైన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

రాత్రయితే చేతివాటమే..

- ప్రభుత్వ దుకాణం నుంచి మద్యం అక్రమ తరలింపు
- అధిక ధరలు వసూలు చేస్తున్న వైనం

కొవ్వూరు: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ క్వార్టర్ బాటిల్‌పై రూ.10 చొప్పున అదనంగా తీసుకుని బయట వ్యక్తులకు కేసుల వారీగా విక్రయిస్తున్నారు. కొవ్వూరు పట్టణంలో పెట్రోల్ బంక్‌ల ఎదురుగా ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న సిబ్బంది శుక్రవారం రాత్రి దుకాణం మూశారు. మద్యం బాటిళ్లను అట్టపెట్టె (కేసు)లో పెట్టి మోటార్ సైకిల్‌పై తరలించారు. స్థానికంగా అక్కడే ఉన్న మందుబాబులు ఈ చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించారు. ఇప్పుడు అవి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఉదయం 11 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ దుకాణాలు పని చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ రాత్రి పూట సమయ పాలన పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. దుకాణాల్లో పనిచేసే సిబ్బంది షాపులు మూసిన తర్వాత ఫుల్ బాటిల్‌పై రూ.150 నుంచి రూ.200 అదనంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. మద్యం దుకాణాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదన్న విమర్శలున్నాయి. అసలు మద్యం డిపో నుంచి దుకాణాలకు మద్యం కేటాయింపు వ్యవహారంలో డిపో అధికారుల పర్యవేక్షణ ఉండాలి. మద్యం దుకాణాల్లో అమ్మకాలు, సిబ్బందికి విధుల కేటాయింపు, పనితీరు పర్యవేక్షణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం చూడాలి. మద్యం అనధికారిక విక్రయాలు, అక్రమ రవాణా నియంత్రణపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు, లా అండ్ పోలీసులు చర్యలు తీసుకోవాలి. కొవ్వూరు మద్యం దుకాణాల నుంచి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నప్పటికీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. దీనిని 'సాక్షి' సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమ పరిధి కాదంటూ మరో విభాగం అధికారులపై నెట్టివేసే ప్రయత్నం చేశారు. ఈ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే అవకతవకలకు అడ్డుకట్ట వేయవచ్చు.


కొవ్వూరులో మద్యం దుకాణం నుంచి అట్టపెట్టెలో బాటిళ్లను తీసుకెళ్తున్న సిబ్బంది

అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలో స్వర్ణ పతకాలు


బాక్సింగ్ పోటీలో పతకాలు సాధించిన క్రీడాకారులు

మామిడికుదురు: భూటాన్ దేశంలోని చింపూలో జరిగిన ఫస్ట్ ఓపెన్ ఇంటర్నేషనల్ గేమ్స్-2024 బాక్సింగ్ పోటీల్లో మన రాష్ట్రానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని బాక్సింగ్ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ నింజా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 26 నుంచి 28వ తేదీ వరకూ జరిగిన పోటీల్లో మన రాష్ట్రానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు బంగారు పతకాలు గెలుపొందగా, ఒకరు వెండి పతకం సాధించారన్నారు. జి.పావని సాయిమహి (గెద్దాడ), ఎం.ప్రసీద (గూడపల్లి), సీహెచ్ అఖిలప్రియ (మానేపల్లి), ఎస్‌కే నజ్రీన్ (రాజమహేంద్రవరం), ఎం.వందన (అనంతపురం), ముఖేష్ సాయియాదవ్ (తిరుపతి) బంగారు, వై.దివ్యవాణి (అరవపాలెం) వెండి పతకం కైవసం చేసుకున్నారన్నారు. వీరు తన వద్ద తర్ఫీదు పొందారని చెప్పారు. ఎస్ఆర్ఐ పితాని నాగరాజు వీరికి స్పాన్సర్‌గా వ్యవహరించారన్నారు.

మార్కెట్‌లోకి నిస్సాన్ ఎక్స్-ట్రైల్ కారు

రాజమహేంద్రవరం రూరల్: నిస్సాన్ ఎక్స్-ట్రైల్ కారును రాజమహేంద్రవరంలోని కంటిపూడి నిస్సాన్ షోరూమ్‌లో కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంటిపూడి నిస్సాన్ జీఎం సూర్య మాట్లాడుతూ సరికొత్త నిస్సాన్ ఎక్స్-ట్రైల్ 7 సీటర్ కారు వరల్డ్స్ ఫస్ట్ వేరియబుల్ కంప్రెషన్ పెట్రోల్ ఇంజిన్, 163 పీఎస్ పవర్, 300 ఎన్ఎం టార్క్, ఎక్స్‌ట్రానిక్ సీవీటీ ఆటోమేటిక్ గేర్ బాక్స్, డుయల్- పేన్ పనోరమిక్ సన్ రూఫ్, 12.3-ఇంచ్ డిజిటల్ డ్రైవర్ డిస్ప్లే, 360-డిగ్రీ కెమెరాతో ఉందని అన్నారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి (చినబాబు), కె.మన్మోహన్‌రామ్, జీఎం సూర్య, ఎస్ఎం హరి, నగర ప్రముఖులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



నిస్సాన్ ఎక్స్-ట్రైల్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసిన కంటిపూడి సర్వారాయుడు

పదండి.. కాపాడికుందాం

- పాలిస్తున్న పశువులపై నిర్లక్ష్యం తగదు
- యాజమాన్య పద్ధతులు అత్యంత ఆవశ్యకం
- ఈతలు పెంచడం ద్వారా పాల వృద్ధి

ఆలమూరు: జనాభా గుణాత్మకంగా పెరిగిపోతోంది. కానీ వారి జీవనాధారమైన ఆహారం ఆ స్థాయిలో పెరగకపోవడం, అంతకంతకూ దిగజారిపోవడం ప్రమాదకరంగా ఉంది. వ్యవసాయ భూములు తరిగిపోతున్నాయి. వాటిని ఎలాగూ పెంచలేము. తక్కువ భూమిలో అధిక దిగుబడి సాధనపైనే శాస్త్రవేత్తలు దృష్టిపెడుతున్నారు. అదే క్రమంలో పశుపోషణ, పశుగణాభివృద్ధిపైనా వారు అదే కృషి చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సూచనలు సలహాలు పాడి రైతులకు అందిస్తూ తక్కువ పశువులతో అధిక పాల దిగుబడి సాధించేలా వాటి పోషణకు ఎన్నో సూచనలు ఇస్తున్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే పాడి రైతుకు జీవనాధారం. పాడి పశువుల పెంపకంలో పశుసంవర్ధకశాఖ సూచనలు, సలహాలు తీసుకుంటూ సమతుల ఆహారాన్ని అందిస్తూ సంరక్షణ బాధ్యతలు తీసుకుంటే ఆరోగ్యకరమైన పశు సంతతి వృద్ధి అవుతుంది. అలాగే సకాలంలో చూడి పరీక్షలు చేయించడం, సమీకృత దాణా గాని, పచ్చగడ్డితో కాని పశువులను మేపడం చేస్తే త్వరితగతిన దూడలు కౌమార దశకు చేరుకుని ఎదకు వచ్చే అవకాశం ఉంటుంది. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమను కూడా రైతులు సద్వినియోగం చేసుకుంటే అనూహ్యమైన ఫలితాలు సాధించవచ్చని పశుసంవర్ధకశాఖ నిపుణులు చెబుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,36,242 పశువులు ఉండగా అందులో ఆవులు 75,839, గేదెలు 1,60,403 ఉన్నాయి. జిల్లాలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పశుసంతతిని వృద్ధి చేసుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో పాడి రైతులు పశువుల పెంపకాన్ని సమగ్రంగా సాగిస్తే పశుగణాభివృద్ధితో పాటు అధిక పాల ఉత్పత్తి సాధ్యమవుతుంది. అప్పుడే పుట్టిన దూడ దశ నుంచి కౌమారదశకు చేరుకుని ఎదకు వచ్చే వరకూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే పశుగణం దినాదినాభివృద్ధి చెందుతుంది. ఆవు, గేదె దూడలకు వయసును బట్టి బరువు ఉండేలా చర్యలు తీసుకోవడం ద్వారా మేలైన పశుసంతతి లభిస్తుంది. ఆవు దూడ జన్మించినప్పుడు సాధారణంగా 25 నుంచి 35 కేజీలు ఉండాల్సి ఉండగా ఏడాది దాటిన తరువాత ఎదకు వచ్చే సరికి, దాదాపు మూడు వంతులు బరువు అంటే 105 కేజీలు దాటాలి. అలాగే గేదె దూడలు 35 నుంచి 40 కేజీల వరకూ బరువు ఉండాల్సి ఉండగా ఎదకు వచ్చే మూడేళ్ల నాటికి సుమారు 180 కేజీలు దాటి ఉంటే ఆ పశువు ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యులు గుర్తిస్తారు.


పచ్చిగడ్డి దాణా తింటున్న గేదెలు

పాడి-పంట

ఒట్టిపోయే కాలాన్ని తగ్గించాలి

దూడలు జన్మించిన నాటి నుంచి యుక్త వయసు వచ్చి సంపర్కం జరిగి చూడి కట్టే వరకూ పశువుల సంరక్షణ బాధ్యతతో పాటు వయసుకు తగిన బరువును, ఎదుగుదలను ఎప్పటికప్పుడు నిర్ధారించుకోవాలి. పశువులు తొలి దూడ పుట్టిన తరువాత నిర్దిష్ట సమయంలో ఈతల మధ్య వ్యవధిని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన దూడలతో పాటు అధిక పాల దిగుబడిని ఆశించవచ్చు. సాధారణంగా ఉత్తమ జాతి ఆవు కానీ, గేదె కాని 300 రోజుల పాటు ఏకధాటిగా పాలిస్తుంది. అనంతరం ఆ పశువు పాల ఉత్పత్తి మందగించి చివరకు వట్టిపోయే దశకు చేరుకుంటుంది. ఈ కాలంలో పశువులను మేపడంపై పాడి రైతు అంతగా ఆసక్తి చూపరు. దీని వల్ల పాడి పశువులకు ఈత మధ్య ఎడం తగ్గించాల్సి రావడం లాభదాయకంగా ఉంటుంది. అలాగే పాడి పశువు వట్టిపోయే కాలాన్ని తగ్గించడం ద్వారా పాడి రైతుకు కొంత ఉపశమనం కలుగుతుంది. గేదె ఈనిన మూడు నుంచి నాలుగు నెలల లోపు చూడి కట్టించడం ద్వారా పశువు వట్టిపోయే లోపు మళ్లీ ఈతకు వచ్చి పాల దిగుబడినిస్తుంది. ఈ ప్రక్రియ వల్ల పశువు వట్టిపోయే కాలం అసాధారణంగా తగ్గుతుంది. దీని వల్ల పశువులు పాలిచ్చే సమయంతో పాటు మేలుజాతి దూడల సంఖ్య పెరుగుతుంది. అలాగే పెయ్యి దూడలను కోడె దూడల చెంత ఉంచడం ద్వారా పశువులు పరిపక్వత చెంది ఎదకు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.

పశుసంతతి పెంపు ద్వారా అధిక పాల దిగుబడి



పశుసంవర్ధకశాఖ సూచనలు, సలహాల మేరకు పాడి రైతులు సమగ్రమైన చర్యలు తీసుకుంటే పశుగణాభివృద్ధి, అధిక పాల దిగుబడి సాధించవచ్చు. పశువులకు ఎల్లప్పుడు సంరక్షణ చర్యలతో పాటు సమతుల ఆహారం అందించడం ద్వారా మేలైన పశువుల ఉత్పత్తి జరుగుతుంది. క్రమేపీ పాల దిగుబడి అధికంగా పెరిగి పాడిరైతుకు జీవనాధారం పెరుగుతుంది.

– ఎల్.అనిత, పశుసంవర్ధకశాఖ ఏడీ, ఆలమూరు

యాజమాన్య పద్ధతులు

- పెయ్యిదూడ వయసు నుంచే పోషణ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి. దూడలకు ముర్రుపాలను పట్టడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- పెయ్యిదూడ త్వరగా యుక్త వయసుకు చేరుకుని దూడలకు జన్మనిస్తుంది.
- కౌమారదశలో ఉన్న పశువులకు తప్పనిసరిగా సమతుల్య ఆహారాన్ని, ఖనిజ లవణ మిశ్రమాన్ని తగిన మోతాదులో అందించాలి.
- పశువుల్లో తరచూ సంభవించే వ్యాధుల నివారణకు సకాలంలో చికిత్సను అందించాలి.
- కాలానుగుణంగా వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో అందించాలి.
- పశువులను అధిక వేడిమి, వేడి గాలుల నుంచి రక్షణ కల్పించాలి.
- యుక్త వయసుకు త్వరగా రాని పశువులను కొంత కాలం కోడె పశువులతో కలిపి ఉంచితే త్వరగా ఎదకు వచ్చే అవకాశం ఉంటుంది.